క్లుప్తంగా

ఏపీ తరహాలో కనీస వేతనం ఇవ్వాలి



జడ్చర్ల టౌన్‌: ఏపీ తరహాలో మున్సిపల్‌ కార్మికులకు కనీస వేతనం రూ.21వేలు ఇవ్వాలని తెలంగాణ మున్సిపల్‌ వర్కర్స్‌ అండ్‌ ఎంప్లాయిస్‌ యూనియన్‌ జిల్లా అధ్యక్షుడు వెంకటేష్‌ ప్రభుత్వాన్ని డిమాండ్‌ చేశారు. సోమవారం కావేరమ్మపేటలో పట్టణ కమిటీ సమావేశం నిర్వహించారు. అదేవిధంగా కార్యాలయంలో సమస్యలపై వినతిపత్రాన్ని సమర్పించారు. జిల్లా కోశాధికారి విజయ్‌, ఆర్గనైజింగ్‌ కార్యదర్శి కృష్ణ, కార్మికులు అలివేలు, అంజమ్మ, నాగమ్మ, నర్సమ్మ, కళమ్మ, అరుణ్‌కుమార్‌ తదితరులు పాల్గొన్నారు.

ఉమ్రాయాత్రికుడికి సన్మానం

స్టేషన్‌ మహబూబ్‌నగర్‌: మక్కా షరీఫ్‌ ఉమ్రా యాత్రకు వెళ్తున్న జిల్లా కేంద్రానికి సీనియర్‌ జర్నలిస్ట్‌ మక్బూల్‌పాషను సోమవారం స్థానిక ఉర్దూ మీడియా సెంటర్‌లో తోటి జర్నలిస్టులు, ఎంఐఎం ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్‌ జాబీర్‌ బిన్‌ సయీద్‌, పార్టీ యువత విభాగం జిల్లా అధ్యక్షుడు జాకీర్‌ ఘనంగా సన్మానించారు. షాబుద్దీన్‌, తఖీ హుస్సేన్‌, అలీం సిద్దిఖీ, జాఫర్‌ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి పల్లెబాట

గండేడ్‌: పరిగి ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి మంగళవారం నుంచి పల్లెబాట కార్యక్రమం చేపట్టనున్నట్లు బీఆర్‌ఎస్‌ మండల అధ్యక్షుడు పెంట్యానాయక్‌ సోమవారం తెలిపారు. ఇందులో భాగంగా పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభం, శంకుస్థాపనలు, ప్రజల సమస్యలు తెలుసుకోవడం, అవసరాలు గుర్తించడం, వినతులు స్వీకరించడంతో పాటు సమీక్ష తదితరాలు ఉంటాయన్నారు. పగిడ్యాల్‌లో కార్యక్రమం ప్రారంభం అవుతుందన్నారు.

కిష్టంపల్లి ఉపసర్పంచ్‌ మృతి

నవాబుపేట: మండల పరిధిలోని కిష్టంపల్లి ఉపసర్పంచ్‌ ముత్యాలు (76) సోమవారం తెల్లవారు జామున గుండెపోటుతో మృతి చెందినట్లు ఆమె కుమారుడు బీఆర్‌ఎస్‌ నాయకుడు సునీల్‌ తెలిపారు. అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్సపొంది కోలుకుంటున్న తరుణంలో ఆకస్మాత్తుగా గుండెపోటు వచ్చిందని అన్నారు. ఈ మేరకు బాధిత కుటుంబాన్ని మండల ప్రజాప్రతినిధులు, అధికారులు పరామర్శించారు.

అక్రమంగా చేపలు పట్టడంపై ఫిర్యాదు

జడ్చర్ల: కరివెన రిజర్వాయర్‌లో ఇతర ప్రాంతాలకు చెందిన వారు అక్రమంగా చేపలు పట్టుకుని సొమ్ము చేసుకుంటున్నారని వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని రైతు రాజ్యం పార్టీ అధ్యక్షుడు బాలకృష్ణ సోమవారం కలెక్టర్‌కు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. రిజర్వాయర్‌లో ముంపునకు గురైన కరివెన, కొత్తూరు గ్రామాలకు చెందిన వారే చేపలు పట్టుకుని అమ్ముకునే విధంగా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

విద్యార్థికి అభినందన

మహబూబ్‌నగర్‌ ఎడ్యుకేషన్‌: జిల్లా కేంద్రంలోని వాగ్దేవీ జూనియర్‌ కళాశాల విద్యార్థి శివ ప్రసాద్‌ జేఈఈ మెయిన్స్‌లో ఆల్‌ ఇండియా 127వ ర్యాంకు సాధించారు. ఈమేరకు విద్యార్థిని మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌ సోమవారం అభినందించారు. జేఈఈ అడ్వాన్స్‌ పరీక్షలో కూడా మంచి మార్కులు సాధించి కళాశాలకు, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని పేర్కొన్నారు. కళాశాల కరస్పాండెంట్‌ వెంకట్‌రెడ్డి, ప్రిన్సిపాల్‌ గీతాదేవి, అకాడమీ ఇన్‌చార్జ్‌ పావని తదితరులు పాల్గొన్నారు.

నేడు హనుమాన్‌చాలీసా పారాయణం

స్టేషన్‌ మహబూబ్‌నగర్‌: కర్ణాటక ఎన్నికల సందర్భంగా అధికారంలోకి వస్తే బజరంగ్‌దళ్‌ను నిషేధిస్తామని కాంగ్రెస్‌ మేనిఫెస్టోలో ప్రకటించడాన్ని నిరసిస్తూ మంగళవారం హనుమాన్‌ చాలీసా పారాయణం నిర్వహించనున్నారు. ఈ మేరకు విశ్వహిందూ పరిషత్‌ జిల్లా కార్యదర్శి నలిగేశి లక్ష్మీనారాయణ, బజరంగ్‌దళ్‌ విభాగ్‌ కన్వీనర్‌ సురేష్‌, ప్రచార ప్రముఖ్‌ సంపత్‌, జిల్లా కన్వీనర్‌ అనిల్‌గౌడ్‌, సహ కన్వీనర్‌ కుమార్‌ సోమవారం ఓ ప్రకటనలో వివరాలు పేర్కొన్నారు. పాపులర్‌ ఫ్రంట్‌ ఆఫ్‌ ఇండియాతో బజరంగ్‌దళ్‌ను పోల్చడం సరికాదన్నారు. హనుమాన్‌చాలీసా కార్యక్రమంలో హిందూ బంధువులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

నేటి నుంచి దీక్షలు

నారాయణపేట రూరల్‌: కోటకొండను మండల కేంద్రంగా చేయాలని మండల సాధన సమితి నాయకులు డిమాండ్‌ చేశారు. మంగళవారం నుంచి చేపడుతున్న రిలే దీక్షలను విజయవంతం చేయాలని కోరుతూ సోమవారం పట్టణంలోని అంబేడ్కర్‌ భవనంలో సమావేశం నిర్వహించారు సమష్టిగా పోరాటం చేసి మండలం సాధించుకుందామని పిలుపునిచ్చారు. నాయకులు కెంచె శ్రీనివాసులు, వెంకట్రాములు, నర్సింహులు, ఇస్మాయిల్‌, హజిమలాంగ్‌, చెన్నప్ప, ప్రవీణ్‌, రాజు పాల్గొన్నారు.

శరవేగంగా పాలమూరు అభివృద్ధి

- 2 న అప్పన్నపల్లి రెండో ఆర్‌ఓబీ ప్రారంభం
- మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి



అబ్దుల్‌ఖాదర్‌ దర్గా సమీపంలో నిర్మిస్తున్న బ్రిడ్జిని పరిశీలిస్తున్న మంత్రులు ప్రశాంత్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్‌, ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి తదితరులు

మహబూబ్‌నగర్‌ మున్సిపాలిటీ: అప్పన్నపల్లి వద్ద రెండో రైల్వే ఓవర్‌ బ్రిడ్జి (ఆర్‌ఓబీ) ని వచ్చే నెల 2న ప్రారంభిస్తామని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి వెల్లడించారు. పాలమూరు పట్టణం శరవేగంగా అభివృద్ధి చెందుతోందన్నారు. జిల్లా కేంద్రంలో ఆర్‌ అండ్‌ బీ ద్వారా చేపట్టిన పలు కార్యక్రమాలను సోమవారం ఆయన తనిఖీ చేశారు. ముందుగా అప్పన్నపల్లి రెండో ఆర్‌ఓబీని పరిశీలించి కేవలం 12 నెలల్లోనే పూర్తి చేయడంలో రాష్ట్ర ఎక్సైజ్‌, క్రీడల శాఖ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్‌ కృషి, పట్టుదల ఎంతో ఉందన్నారు. ఆర్‌ అండ్‌ బీ జంక్షన్‌ అభివృద్ధి పనులను, అబ్దుల్‌ ఖాదర్‌ దర్గా సమీపంలో నిర్మిస్తున్న రెహమానియా బ్రిడ్జిని చూశారు. బ్రిడ్జిని సాధ్యమైంత త్వరగా పూర్తి చేయాలని సూచించారు. ఇక్కడ ఒకప్పుడు సింగిల్‌ లైన్‌ ఉంటే ఇప్పుడే ఫోర్‌ లైన్‌గా మార్పించిన ఘనత మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌కే దక్కుతుందన్నారు. ఆయన హయాంలో పట్టణాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారని కొనియాడారు.

ఉపాధికి చిరునామా..

జిల్లాలో అందరికీ అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తున్నామని రాష్ట్ర ఎక్సైజ్‌, క్రీడల శాఖ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్‌ అన్నారు. ఒకప్పుడు పేదరికం, వలసలకు మారుపేరుగా నిలిచిన జిల్లా ఇప్పుడు అపారమైన అవకాశాలకు నిలయంగా మారిందన్నారు. ఇప్పుడు పాలమూరుకే వలస వచ్చేలా అభివృద్ధి చేశామని వివరించారు. గతంలో జడ్చర్ల నుంచి మహబూబ్‌నగర్‌ వరకు సింగిల్‌ రోడ్డు ఉండేదని తరచూ ట్రాఫిక్‌జాం ఏర్పడి గంటల తరబడి వాహనాలు నిలిచిపోయేవన్నారు. తాము అధికారంలోకి వచ్చాకే నాలుగు లైన్లుగా మార్చామన్నారు. గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణం వరకు ఉన్న ఆర్‌ అండ్‌ బీ రోడ్లు, ఇతర పనులను త్వరలోనే పూర్తి చేయిస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి, కలెక్టర్‌ జి.రవి నాయక్‌, అడిషనల్‌ కలెక్టర్‌ కె.సీతారామారావు, మున్సిపల్‌ చైర్మన్‌ కేసీ నర్సింహులు, ముడా చైర్మన్‌ గంజి వెంకన్న, జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడు రాజేశ్వర్‌గౌడ్‌, మున్సిపల్‌ వైస్‌ చైర్మన్‌ తాటి గణేష్‌కుమార్‌ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి.. మహాప్రభో!



లక్ష్మీనగర్‌ కాలనీలోని ఓపెన్‌ ప్లాట్లలో ఏపుగా పెరిగిన ముళ్లపొదలు

మహబూబ్‌నగర్‌ మున్సిపాలిటీ: తమ కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని వార్డు నం.2 పరిధిలోని లక్ష్మీనగర్‌ కాలనీవాసులు విజ్ఞప్తి చేస్తున్నారు. ముఖ్యంగా రూరల్‌ పోలీస్‌స్టేషన్‌ ఎదురు గల్లీలోని ఓపెన్‌ ప్లాట్లలో ముళ్లపొదలు, పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగాయని చెబుతున్నారు. కాలనీ మధ్యలోని పెద్ద కాలువ నిర్వహణ సరిగా లేనందున పందులు, కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయన్నారు. గల్లీ రోడ్లపై యథేచ్ఛగా సంచరిస్తుండటంతో పాదచారులు, విద్యార్థులు, వాహనదారులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని వాపోతున్నారు. పందులు, కుక్కల కళేబరాలతో కాలనీ మొత్తం దుర్గంధభరితంగా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దోమల బెడదతో తరచూ మలేరియా, డెంగీ, విష జ్వరాలు ప్రబలుతున్నాయని, అదేవిధంగా అప్పుడప్పుడు పాములు ఇళ్లలోకి రావడంతో ఆందోళనకు గురవుతున్నామన్నారు. అలాగే ఎస్‌బీఐ పద్మావతీకాలనీ బ్రాంచీకి ఎదురుగా లక్ష్మీనగర్‌లోకి వెళ్లే మార్గంలో సమీప హోటళ్ల నుంచి ఆహార వ్యర్థ పదార్థాలు ఓపెన్‌ నాలాలో కలిసి దుర్గంధం వెదజల్లుతోందన్నారు. ఈ వార్డుకు మున్సిపల్‌ చైర్మన్‌ కేసీ నర్సింహులు ప్రాతినిధ్యం వహిస్తున్నందున తమ సమస్యలను వెంటనే పరిష్కరించాలని వారు విన్నవిస్తున్నారు. ఈ విషయమై ఆయనను వివరణ కోరగా త్వరలోనే పారిశుద్ధ్య కార్మికులను అక్కడికి పంపించి పెద్ద కాలువతో పాటు ఓపెన్‌ నాలాలను శుభ్రం చేయిస్తామన్నారు. అవసరమైతే అండర్‌గ్రౌండ్‌ డ్రైనేజీ నిర్మాణానికి కృషి చేస్తామన్నారు. ఈ కాలనీలో నెలకొన్న సమస్యలను తప్పక పరిష్కరిస్తామన్నారు.

రామలింగేశ్వరుడిని దర్శించుకున్న జెడ్పీసీఈఓ



జెడ్పీ సీఈఓ కుటుంబ సభ్యులకు తీర్థప్రసాదాలను అందజేస్తున్న అర్చకులు

అడ్డాకుల: కందూర్‌ శివారులో స్వయం భు గా రామలింగేశ్వరస్వామిని సోమవారం జెడ్పీ సీఈఓ జ్యోతి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఈ మేరకు ఆలయ అర్చకులు వారికి ఘనస్వాగతం పలికారు. శాలువాలతో సత్కరించి తీర్థప్రసాదాలను అందజేశారు. ఆలయ ఉద్యోగులు అనంత శర్మ, సాయిబాబా, కమిటీ సభ్యులు ప్రభాకర్‌రెడ్డి, చంద్రమౌళి, కొత్త లక్ష్మయ్య, వడ్ల శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా ఆలయం పక్కన ఉన్న కల్యాణ మండపం వద్ద సోమవారం మధ్యాహ్నం కర్ణాటకకు చెందిన భక్తులు నీలమ్మ, విరుపాక్ష దంపతులు అన్నదానం చేయించారు. కార్యక్రమంలో ఈఓ రాజేశ్వరశర్మ తదితరులు ఉన్నారు.

న్యాయం చేసే వరకు పోరాటం

జడ్చర్ల: సమస్యలు పరిష్కరించి వీఓఏలకు న్యాయం చేసే వరకు పోరాటం సాగుతుందని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి సత్తయ్య తెలిపారు. మండల పరిషత్‌ కార్యాలయం ఎదుట వీఓఏలు చేపట్టిన సమ్మె సోమవారం 22వ రోజుకు చేరుకున్న సందర్భంగా మాట్లాడారు. కార్యక్రమంలో వీఓఏలు స్వాతి, జ్యోతి, లక్ష్మి, రమాదేవి, వసియాబేగం, సరిత తదితరులు పాల్గొన్నారు.

మొబైల్‌ ఫోన్లు చోరీ చేసి పట్టుబడిన దొంగ

జడ్చర్ల: స్థానిక క్లబ్‌ రోడ్‌ ప్రాంతంలో కొత్తగా నిర్మిస్తున్న అపార్ట్‌మెంట్‌ భవన నిర్మాణ పనులు చేస్తున్న కూలీల మొబైల్‌ ఫోన్లను సోమవారం ఓ దొంగ అపహరించాడు. ఈ మేరకు అతడు పారిపోతుండగా కూలీలు పట్టుకుని స్థానిక పోలీసులకు అప్పగించారు. దొంగ నుంచి మొత్తం నాలుగు మొబైల్‌ ఫోన్లకు గాను మూడింటిని స్వాధీనం చేసుకున్నారు. కాగా మరో ఫోన్‌ ఏం చేశాడో తెలియడం లేదని బాధితులు యూపీకి చెందిన కూలీలు సూరజ్‌, రాహుల్‌లు తెలిపారు. ఈ మేరకు నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నామని అతడు హౌసింగ్‌బోర్డు కాలనీకి చెందిన నవీన్‌గా గుర్తించామని వివరించారు.

తలసేమియా బాధితులను ఆదుకుందాం



రక్తదానం చేస్తున్న యువత

జడ్చర్ల టౌన్‌: రక్తదానం చేసి తలసేమియా బాధితులను ఆదుకుందామని జిల్లా రెడ్‌క్రాస్‌ చైర్మన్‌ నటరాజ్‌ పిలుపునిచ్చారు. ప్రపంచ రెడ్‌క్రాస్‌ దినోత్సవం–తలసేమియా దినోత్సవం పురస్కరించుకుని సోమవారం మండలంలోని పోలేపల్లి సెజ్‌ సమీపంలోని ఎల్‌అండ్‌టీలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఆ సంస్థ నైపుణ్య విభాగం ప్రిన్సిపాల్‌ దీపక్‌కుమార్‌ శర్మతో కలిసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లాలో 172మంది తలసేమియా బాధితుల రక్షణకు క్రమం తప్పకుండా రక్తం అవసరమన్నారు. తలసేమియా దినోత్సవం పురస్కరించుకుని రక్తదానం చేసిన యువతను అభినందించారు. దీపక్‌ శర్మ మాట్లాడుతూ ఎల్‌ అండ్‌ టీ ఆధ్వర్యంలో ఏటా నాలుగైదు పర్యాయాలు రక్తదాన శిబిరాలను నిర్వహిస్తున్నామన్నారు. శిబిరంలో రెడ్‌క్రాస్‌ సమన్వయకర్త అశ్విని చంద్రశేఖర్‌, ఎల్‌ అండ్‌టీ అడ్మిన్‌ శ్రీనివాసరావు ప్రసాద్‌లు పాల్గొన్నారు. శిబిరంలో 102మంది రక్తదానం చేయగా సంస్థ తరఫున నటరాజ్‌ను సత్కరించారు.

సభకు తరలిన నాయకులు

మిడ్జిల్‌: హైదరాబాద్‌లో సోమవారం కాంగ్రెస్‌ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన యువ సంఘర్షణ సభకు మండలం నుంచి నాయకులు తరలివెళ్లారు. మండల పార్టీ అధ్యక్షుడు అల్వాల్‌రెడ్డి, నాయకులు సంపత్‌, గౌస్‌, సాయిలు, విజయ్‌, వెంకటేష్‌ గౌడ్‌, నర్సింహ, తదితరులు ఉన్నారు.

‘మంత్రిని విమర్శించే స్థాయి జీఎంఆర్‌కు లేదు’

జెడ్పీసెంటర్‌(మహబూబ్‌నగర్‌): మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌ను విమర్శించే స్థాయి డీసీసీ అధ్యక్షుడు జీఎంఆర్‌కు లేదని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌ రాజేశ్వర్‌గౌడ్‌, మున్సిపల్‌ చైర్మన్‌ నర్సిములు అన్నారు. సోమవారం బీఆర్‌ఎస్‌ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జీఎంఆర్‌ను తీవ్రంగా విమర్శించారు. ప్రజా సేవకు అంకితమైన శ్రీనివాస్‌గౌడ్‌ ను విమర్శించడం మంచిది కాదని అన్నారు. ఆయన హయాంలో పాలమూరు ముందంజలో ఉందన్నారు. బీఆర్‌ఎస్‌ వచ్చిన తరువాత నౌకర్లు గా వున్న వారంతా నేడు యాజమానులుగా మారారని, కాంగ్రెస్‌ నాయకులు పద్ధతి మార్చుకోకపోతే ఊరుకోబోమన్నారు. ముడా చైర్మన్‌ వెంకన్న, వైస్‌ చైర్మన్‌ గణేష్‌, గోపాల్‌యాదవ్‌ కౌన్సిలర్‌ కిషోర్‌ తదితరులు పాల్గొన్నారు.

మండలం ఏర్పాటు చేయాలని పాదయాత్ర



కోయిల్‌కొండ: గార్లపహాడ్‌ను మండలంగా ప్రకటించాలని సాధన సమితి ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కలెక్టరేట్‌కు పెద్దసంఖ్యలో ఆయా గ్రామాల ప్రజలు పాదయాత్రగా తరలివెళ్లారు. ఈసందర్భంగా జేఏసీ కన్వీనర్‌ రామునాయక్‌, వెంకట్రామిరెడ్డి మాట్లాడారు. జాయింట్‌ కలెక్టర్‌కు వినతి సమర్పించామని తెలిపారు. వంద రోజులకుపైగా రిలే దీక్షలు చేపడుతున్నా ప్రభుత్వం స్పందించడంలేదన్నారు. ఇప్పటికైనా చర్యలు తీసుకోవాలని కోరారు. పాదయాత్రలో వెంకటేష్‌, దమాయపల్లి, ఆంజనేయులు, రవి, చందునాయక్‌, కృష్ణయ్య, రాజు, అంజి తదితరులు పాల్గొన్నారు.

‘ప్రభుత్వ హెచ్చరికను పట్టించుకోం’

జెడ్పీసెంటర్‌(మహబూబ్‌నగర్‌) : జూనియర్‌, ఔట్‌ సోర్సింగ్‌ పంచాయతీ కార్యదర్శులను రెగ్యులర్‌ చేసేదాక పోరాటం చేస్తామని, ప్రభుత్వ హెచ్చరికను పట్టించుకోబోమని కార్యదర్శుల ఫెడరేషన్‌ జిల్లా అధ్యక్షుడు శివప్రసాద్‌ హెచ్చరించారు. స్థానిక ధర్నాచౌక్‌లో సమ్మె 11వ రోజు సోమవారం ఆయన మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా 391 మంది పంచాయతీ కార్యదర్శులు ఉన్నారని రెగ్యులర్‌ చేసేదాక తమ పోరాటం ఆగదన్నారు. కార్యక్రమంలో సంఘం ప్రధానకార్యదర్శి చంద్రశేఖర్‌, జిల్లా కోశాధికారి లక్ష్మీకాంత్‌, జిల్లా ఉపాధ్యక్షుడు పాండు, రవి, రఘుపతిరెడ్డి, నర్మద, శిరీషా, రవి, హాజీ, తదితరులు పాల్గొన్నారు.

మే డే వారోత్సవాలు



మాట్లాడుతున్న నాయకులు

మహబూబ్‌నగర్‌ రూరల్‌ : భవన నిర్మాణ కార్మికుల వెల్ఫేర్‌ బోర్డు రక్షణ కోసం పోరాటాలు చేస్తామని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నల్లవెల్లి కురుమూర్తి, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి వరద గాలన్నలు అన్నారు. సోమవారం మండలంలోని కోటకదిర గ్రామంలో మేడే ఉత్సవాలలో భాగంగా సర్వసభ్య సమావేశంలో మాట్లాడారు. అనంతరం కోటకదిర భవన నిర్మాణ కార్మిక సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బాబు, ప్రధాన కార్యదర్శిగా రమేష్‌, ఉపాధ్యక్షుడిగా వడ్డె ఆంజనేయులు, కార్యదర్శిగా రాములు, కోశాధికారిగా ఆంజనేయులు తదితరులు ఎన్నికయ్యారు. హన్మంతు, రాజు తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు సమగ్ర చట్టం చేయాలి..

కోయిల్‌కొండ: అసంఘటిత కార్మికులకు సమగ్ర చట్టం చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నల్లవల్లి కురుమూర్తి, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి వరదగాలన్నలు అన్నారు. సోమవారం దమాయపల్లిలో కార్మికుల జనరల్‌బాడీ సమావేశం నిర్వహించి మాట్లాడారు. వెంకటయ్య, కనకయ్య, బాలయ్య పాల్గొన్నారు.

ఉచిత బస్‌పాస్‌లను వినియోగించుకోవాలి

జడ్చర్ల: ప్రభుత్వం దివ్యాంగుల కోసం అమలు చేస్తున్న ఉచిత ఆర్టీసీ బస్సు పాస్‌లను వినియోగించుకుని లబ్ధిపొందాలని జడ్పీ వైస్‌ చైర్మన్‌ యాదయ్య తెలిపారు. సోమవారం మండల పరిషత్‌ కార్యాలయంలో అర్హత కలిగిన వారికి ఉచిత బస్‌పాస్‌లను పంపిణీ చేశారు. మంగళవారం కూడా బస్‌పాస్‌ల జారీ కొనసాగుతుందని వివరించారు. దివ్యాంగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు చెన్నకేశవులు, సెక్రటరీ శ్రీనివాస్‌, ఉపాధ్యక్షుడు రఫీక్‌ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సరఫరాపై సమీక్ష



అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

జడ్చర్ల: పట్టణంతో పాటు గ్రామీణ ప్రాంతాలలో ఎక్కడా తాగునీటి సమస్యలు తలెత్తకుండా చూడాలని స్థానిక ఎమ్మెల్యే డాక్టర్‌ సి.లక్ష్మారెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక క్యాంపు కార్యాలయంలో ఆయన మిషన్‌ భగీరథ, ఆర్‌డబ్ల్యూఎస్‌, ట్రాన్స్‌కో అధికారులతో తాగునీటి సరఫరా ఇబ్బందులపై సమీక్షించారు. వేసవి కాలం దృష్ట్యా అధికారులు అప్రమత్తంగా ఉండాలని, ఏ చిన్న సమస్య వచ్చినా వెంటనే స్పందించి సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలన్నారు. జఠిలమైన సమస్యలను తన దృష్టికి తీసుకురావాలని, ఎక్కడా తాగునీరు సరఫరాలో ఆటంకం కలుగనీయకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అదేవిధంగా పైపులైన్ల లీకేజీలను అరికట్టాలని, అవసరం కొద్ది కొత్తగా పైపులైన్లు వేయాలన్నారు. కార్యక్రమంలో జడ్పీ వైస్‌ చైర్మన్‌ యాదయ్య, మార్కెట్‌ చైర్మన్‌ గోవర్ధన్‌రెడ్డి, డీఈ వెంకట్‌రెడ్డి, డీఈ శ్రీనివాసులు, మున్సిపల్‌ కమిషనర్‌ షేక్‌, ఏఈ ప్రవీణ్‌రెడ్డి, కౌన్సిలర్లు ప్రశాంత్‌ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బీరప్ప ఉత్సవాల్లో ఎమ్మెల్యే

మిడ్జిల్‌: బోయిన్‌పల్లిలో నిర్వహిస్తున్న బీరప్ప ఉత్సవాల్లో సోమవారం ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన వెంట ఎంపీపీ సుదర్శన్‌, సర్పంచ్‌ నారన్‌రెడ్డి, నాయకులు బాలు, శ్యాంసుందర్‌రెడ్డి, జంగారెడ్డి, ప్రతాప్‌రెడ్డి, పాండు, భద్రయ్య ఉన్నారు.

అడ్డాకులలో తైబజారు వేలం



అడ్డాకుల: మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో సోమవారం తైబజారు వేలం నిర్వహించారు. గ్రామానికి చెందిన దానేలు రూ.18.30లక్షలకు తైబజారును దక్కించుకున్నారు. వచ్చే ఏడాది మార్చి చివరి వరకు తైబజారు వసూలు చేసుకునే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీఓ విజయకుమారి, సర్పంచ్‌ మంజుల, కార్యదర్శి నగేష్‌ గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు

అడ్డాకుల: మూసాపేట మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై గుర్తు తెలియని వాహనం ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టడంతో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఎస్‌ఐ విజయభాస్కర్‌ తెలిపిన వివరాల ప్రకారం..ఖిల్లాఘనపురం మండలానికి చెందిన ఆకుల లక్ష్మయ్య వేముల శివారులోని కోజెంట్‌ గ్లాస్‌ పరిశ్రమలో పని చేస్తున్నాడు. సోమవారం తన ద్విచక్రవాహనంపై నిజాలాపూర్‌ మీదుగా కంపెనీకి వస్తుండగా నరేష్‌ అనే వ్యక్తి లక్ష్మయ్య బైక్‌పై ఎక్కాడు. ఇద్దరు కలిసి వస్తున్న బైక్‌ మూసాపేట చౌరస్తా వద్ద హైవేపైకి రాగానే గుర్తు తెలియని వాహనం వెనుక నుంచి ఢీకొట్టి వెళ్లిపోయింది. దీంతో లక్ష్మయ్యకు గాయాలు అయ్యాయి. నరేష్‌కు ఎలాంటి గాయాలు కాలేదు. ఈ మేరకు గ్లాస్‌ కంపెనీ అంబులెన్స్‌లో లక్ష్మయ్యను ఎనుగొండలోని ఎస్‌వీఎస్‌ ఆస్పత్రికి తరలించారు. తర్వాత మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తీసుకెళ్లారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ విజయభాస్కర్‌ తెలిపారు.

విగ్రహ ఏర్పాటుకు భూమి పూజ

నవాబుపేట: కారుకొండలో సోమవారం దళిత సంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులు అంబేడ్కర్‌ విగ్రహం ఏర్పాటుకు భూమి పూజ చేశారు. వివిధ సంఘాల నాయకులు రమేష్‌, వెంకటేష్‌, యాదయ్య, శ్రీనివాస్‌, వెంకలయ్య, చెన్నయ్య, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న రిలే దీక్షలు



మహమ్మదాబాద్‌: ఫార్మా కంపెనీ రద్దు చేయాలనే డిమాండ్‌తో మండలంలోని దేశాయి పల్లి చౌరస్తాలో చేస్తున్న దీక్షలు సోమవారం 9వ రోజు కొనసాగాయి. ఈ సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షుడు కృష్ణ మాట్లాడుతూ కంపెనీ వస్తే 6 గ్రామాలపై తీవ్రంగా ప్రభావం పడుతుందన్నారు. ప్రజల ఆరోగ్యం తీవ్రంగా దెబ్బతింటుందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నరసింహ, హరి, నరేష్‌, నీలారెడ్డి, భరత్‌, అనంతయ్య, చెన్నయ్య, పాషా, బాలకిష్టయ్య పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలి



మహమ్మదాబాద్‌: మండల పరిధిలోని జూలపల్లిలో సోమవారం వరి కొనుగోలు కేంద్రాన్ని సర్పంచ్‌ కిరణ్‌కుమార్‌రెడ్డి ప్రారంభించారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో స్థానిక బీఆర్‌ఎస్‌ నాయకులు, రైతులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

చెక్కు అందజేత



అడ్డాకుల: కందూర్‌కి చెందిన కుమ్మరి బుచ్చమ్మ కొన్నాళ్ల క్రితం మూసాపేట మండలం జానంపేట వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందింది. ఆమెకు కాంగ్రెస్‌ పార్టీ సభ్యత్వం ఉండటంతో పార్టీ బీమా ద్వారా రూ.2లక్షల చెక్కు మంజూరైంది. సోమవారం హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు జి.మధుసూదన్‌రెడ్డి, ఏఐసీసీ కార్యదర్శి వంశీచంద్‌రెడ్డి చెక్కును బాధిత కుటుంబ సభ్యుడు నర్సింహకు సోమవారం అందజేశారు. మండలాధ్యక్షుడు నాగిరెడ్డి, కొండా జగదీశ్వర్‌ తదితరులు ఉన్నారు.

యోగాసన న్యాయనిర్ణేత పరీక్షలో ప్రతిభ



మంత్రి హరీశ్‌రావు చేతులమీదుగా సర్టిఫికెట్‌ అందుకుంటున్న సురేష్‌

మహబూబ్‌నగర్‌ క్రీడలు: తెలంగాణ యోగాసన స్పోర్ట్స్‌ అసోసియేషన్‌ ఆధ్వర్యంలో ఈనెల 3వ తేదీ నుంచి 7 వరకు యోగా పోటీలకు సంబంధించి ఆన్‌లైన్‌లో 3వ రాష్ట్రస్థాయి న్యాయనిర్ణేత (జడ్జి) శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. అనంతరం సిద్దిపేటలో న్యాయనిర్ణేత పరీక్ష నిర్వహించగా జిల్లాకు చెందిన యూ సురేష్‌ ప్రతిభ చాటి ఉత్తీర్ణత సాధించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఆర్థికశాఖమంత్రి హరీశ్‌రావు చేతుల మీదుగా సురేష్‌ సర్టిఫికెట్‌ను అందుకున్నారు. కార్యక్రమంలో అసోసియేషన్‌ ప్రధాన కార్యదర్శి నందనం కృపాకర్‌, సంయుక్త కార్యదర్శి తోట సతీష్‌ పాల్గొన్నారు. ఈ మేరకు సురేష్‌ను జిల్లా అధ్యక్షుడు కె.సురేష్‌, ప్రధాన కార్యదర్శి కె.సాయికుమార్‌, భారత్‌ స్వాభిమాన్‌ ట్రస్ట్‌ జిల్లా అధ్యక్షుడు వెంకట్రాముడు, పతంజలి యోగా సమితి జిల్లా అధ్యక్షుడు గంగాధర్‌, దత్తురావు, రవికుమార్‌, దయానంద్‌ అభినందించారు.

పనికి తగ్గ వేతనం చెల్లించాలి

నారాయణపేట టౌన్‌: రెండవ ఏఎన్‌ఎంలను రెగ్యులర్‌ చేయాలని డిమాండ్‌ చేస్తూ సోమవారం మున్సిపల్‌ పార్కు ఎదుట తెలంగాణ మెడికల్‌ అండ్‌ హెల్త్‌ ఎంప్లాయిస్‌ యూనియన్‌, సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కన్వీనర్‌ బాల్‌రాం మాట్లాడుతూ 15ఏళ్లుగా పనిచేస్తున్నా సెకండ్‌ ఏఎన్‌ఎంలను రెగ్యులర్‌ చేయడం లేదన్నారు. వైద్య రంగంలో ఆయువు పట్టుగా ఉన్నా ఏఎన్‌ఎంలను వెట్టి చాకిరి చేయించడం అన్యామని, సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని డిమాండ్‌ చేశారు. అనంతరం కలెక్టరేట్‌కు చేరుకొని కలెక్టర్‌ కోయ శ్రీహర్షకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం యూనియన్‌ నాయకులు రాజేశ్వరి, సావిత్రమ్మ, అనురాధ, రాజేశ్వరి, అరుణ, చంద్రకళ, వెంకటమ్మ, గిరిజ తదితరులు పాల్గొన్నారు.

తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలి

నారాయణపేట టౌన్‌: జిల్లాలో అకాల వర్షాల కారణంగా రైతులు సాగు చేసిన పంటలు నష్టపోయారని, తడిసిన వరి ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలని బీకేఎస్‌ జిల్లా కార్యదర్శులు అనంతరెడ్డి, గోపాల్‌యాదవ్‌ డిమాండ్‌ చేశారు. సోమవారం జిల్లా కేంద్రంలో జిల్లా పౌరసరఫరా శాఖ కార్యాలయంలో డీఎం హతీరామ్‌కు బీకేఎస్‌ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చెప్పిన విధంగా తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని కోరారు. కొనుగోలు కేంద్రాల వద్ద తేమ శాతం వస్తేనే కొనుగోలు చేస్తామని అధికారులు చెప్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఎలాంటి షరతులు లేకుండా తడిసిన ప్రతి వరి గింజను రైతుల ద్వారా కొనుగోలు చేసి ఆదుకోవాలని డిమాండ్‌ చేశారు.